నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 05-04-2026

*"మా ఊరిపేరు*
*చెయ్యేరు అగ్రహారం*
*అని చెప్పాను కదా!*
*అదెక్కడుంది?*
*మీరు కోనసీమ పేరు వినే ఉంటారు.*
*దక్షిణ భారతదేశంలోనే*
*ఒక అందమైన ప్రాంతం.*
*ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో...*
*తూర్పుగోదావరి జిల్లాలో*
*కోనసీమ*
*ఎటు చూసినా కొబ్బరి చెట్లు.*
*ఎటుచూసినా గలగల*
*ప్రవహించే*
*నదులు, కాల్వలు...*
*ఎటుచూసినా తినటానికి*
*పిలిచే తియ్యని ఫలవృక్షాలు...*
*మనసుని మత్తెక్కించే*
*పరిమళాల్ని వెదజల్లుతూ*
*రంగురంగుల పూలమొక్కలు...*
*ఆ కోనసీమలో అమలాపురం.*
*దాన్ని కేంద్రంగా అలంకరిస్తూ*
*చుట్టూ నిలిచే గ్రామాలు...*
*దాని చుట్టూ స్వచ్ఛంగా*
*నిత్యం వేదంలా ప్రవహించే*
*నదులు...*
*ప్రకృతి సింగారించుకున్న*
*పచ్చని చీరలా పరుచుకున్న*
*పొలాలు...*
*ప్రతి రోజూ ఏదో*
*పండుగ చేసుకుంటుంటే మ్రోగే*
*మంగళ ధ్వనుల్లా పలికే*
*పక్షుల కిలకిలారావాలు...*

*"ఇంత ఒక సౌందర్యభరితమైన ప్రాంతాన్ని వర్ణిస్తున్నట్టే ఉంది. కానీ, ఆ తర్వాత ఇలా దళిత గ్రామాలను ఇలా పరిచయం చేస్తారు.*
*"గ్రామ గ్రామాన ఆత్మగౌరవ*
*చిహ్నమేదో దారిచూపుతున్నట్లుగా*
*కనిపించే నిలువెత్తు అంబేద్కర్ శిలా*
*విగ్రహాలు ...*

గ్రామ గ్రామాన అంబేద్కర్ విగ్రహాల గురించి ప్రస్తావించవలసిన అవసరమేమి వస్తుందో ఆలోచిస్తేనే... ఆ కళాత్మకత అర్థం అవుతుంది. అది మామూలు వర్ణనల్లాగే కనిపిస్తున్నా, దాని వెనుకే ఒక సత్యందాగుంది. అలా చెప్పగలగడమే కళాత్మక వాస్తవికత! ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారి 'నెమలికన్నులు' ఆత్మకథా భాగాల ఆధారంగా కోనసీమలోని దళితుల పరిస్థితి అత్యంత వైరుధ్యభరితంగా కనిపిస్తుంది. ప్రకృతి పరంగా ఆ ప్రాంతం పచ్చని కొబ్బరి తోటలు, ప్రవహించే గోదావరి పాయలతో ఎంతో సుందరంగా ఉన్నప్పటికీ, ఆ పచ్చదనం వెనుక దళితుల నిరంతర శ్రమ, ఆర్థిక వెనుకబాటుతనం దాగి ఉన్నాయి. అగ్రహారాల వంటి సామాజిక నిర్మాణాల మధ్య నివసిస్తూ, వారు ప్రధానంగా వ్యవసాయ కూలీలుగా, కొబ్బరి దింపు కార్మికులుగా, పశువుల కాపరులుగా కఠినమైన


**సాధారణంగా ఆత్మకథలు వయోవృద్ధులైన వారు తన చివరి కాలంలో రాస్తుంటారు. కానీ, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ఐదు పదుల వయసులో ఆత్మకథ రాయడం అంటే ఒక సాహసమే. దీనిలోని వస్తువు దార్ల గారి జీవితం, రచనలు ఏమాత్రం తెలిసినా, ఎవరికైనా దానిలో ఉండే వస్తువు దళిత వ్యధకు సంబంధించినదై ఉంటుందని ఊహించగలరు. దళిత సమస్యలు దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇంచు మించు ఒకేలా ఉంటాయి. అలాంటప్పుడు మరలా ఆ సమస్యలను తెలుసుకోవడం కోసమే అయితే, చాలా మంది చదవడానికి ఇష్టపడరు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఆత్మకథ ప్రజలలోకి ఎలా వెళ్ళగలిగింది అనేది ఒక ప్రశ్న. ఈ రచన ఒకవైపు వచనంలో రాస్తూనే, మరోవైపు కవిత్వమై ప్రవహించింది. నిజానికి వచనం చదువుతున్నామో, కవిత్వమే చదువుతున్నామో అనేదానికంటే రచనాశైలికి పాఠకుడు ఒక తన్మయత్వానికి గురవుతాడనేది సత్యం. ఈ భాగం అంతా బాల్యానికి సంబంధించిన వర్ణనలే కాబట్టి, అది తమ జీవితమే అన్నట్లుగా అనిపించటం ఒక చెప్పుకో తగిన విశిష్టమైన అంశం. కులాన్ని, దాని వల్ల కలిగే అవమానాల్ని చెప్తున్నట్లు అనిపించకుండగా జీవితాన్నే చూపించడం రచనా శైలిలో గుర్తించాల్సిన ఒక వ్యూహంలా అనిపిస్తుంది.**





శారీరక శ్రమపై ఆధారపడి జీవించేవారు. విద్యాపరంగా, సామాజిక గుర్తింపు పరంగా దళితుల పేర్లు, పుట్టిన తేదీలు కూడా వారి అభీష్టం మేరకు కాకుండా వ్యవస్థాగత ఆధిపత్య వర్గాలు, కులాల కింద నిర్ణయించబడేవని రచయిత వాస్తవికతను వ్యక్తీకరించారు. అయితే, ఇంతటి ఆర్థిక, సామాజిక వివక్షల మధ్య కూడా అంబేద్కర్ విగ్రహాలు ఆత్మ గౌరవ చిహ్నాలుగా నిలవడం, చదువు ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే బలమైన ఆకాంక్ష ఆనాటి దళిత యువతలో మొలకెత్తిందని ఆత్మకథ ద్వారా మనం స్పష్టమైన సంకేతాలుగా అవగాహన చేసుకోవాలి.

# కళాత్మక సత్యాన్ని ఆవిష్కరించే ఆత్మకథ



'నెమలికన్నులు' ఆత్మకథా రచనా శైలి అత్యంత సహజంగా, హృదయానికి హత్తుకునేలా సాగుతుంది. ఆయన శైలిలో ప్రధానంగా కోనసీమ మాండలికపు సొగసు, మట్టి వాసన ఉట్టిపడే పదజాలం కనిపిస్తాయి. క్లిష్టమైన సిద్ధాంతాల కంటే, అనుభవాల ద్వారానే సామాజిక వాస్తవికతను ఆవిష్కరించడం ఇందులో విశేషం. రచయిత ఎక్కడా కృత్రిమత్వానికి తావు లేకుండా, తన బాల్యంలోని పేదరికాన్ని, వివక్షను, కుటుంబ శ్రమను ఉన్నది ఉన్నట్లుగా చిత్రించారు. వర్ణనల్లో దృశ్యరూపకత ఎక్కువగా ఉంటుంది. తన తండ్రి చేసే పను లను వాస్తవికతను వ్యక్తీకరి స్తూనే దృశ్యాన్ని చూపిస్తున్నట్లుగా వర్ణించడం గొప్పశైలిలో కొనసాగింది.

*"నాన్న రోజూ అనేక పనులు చేయడం చూసి*
*నాకు ఆశ్చర్యం వేసేది.*
*అవన్నీ ఎవరు నేర్పారనిపించేది.*
*తెల్లవారితే ఒకరోజు పొలం పనికెళ్ళేవాడు.*
*ఇంకో రోజు కొబ్బరికాయలు దింపుతీసేవాడు.*
*మరోరోజు తాటాకులు కొట్టడానికెళ్ళేవాడు.*
*రోజు రోజుకీ కొత్తకొత్త పనుల్ని చేసేవాడు."*

ఈ వర్ణనలో తన తండ్రి చేసే అనేక పనులను చెప్తున్నట్లు పైకి అనిపిస్తున్నా, నైపుణ్య వృత్తులు, నైపుణ్యం కాని వృత్తుల పేరుతో రకరకాలు విభజనలు చేసి, కొన్ని వృత్తులకు గౌరవం ఇవ్వకుండా, సరైన ప్రతిఫలం కూడా అందకుండా చేసిన కుట్రలను త్రిప్పికొట్టే ఒక బలమైన ప్రాతిపదికలు దీనిలో ఉన్నాయి. జీవితాంతం ఒక వృత్తినే చేసి అదే పెద్ద నైపుణ్యంగా చెప్పుకునే వాళ్ళు, అనేక వృత్తులు చేసి అటన్నిం టిలోనూ విజయవంతం అయ్యే వారిని ఏమనాలి అనేది స్ఫురింపజేయడం దీనిలో దాగిఉన్న ఒక థియరీ. పైకి నిజమే కదా మా వాళ్లంతా బతకడం కోసం రకరకాల పనులు చేయ వలసి వస్తుంది అని అనుకుంటారు. కానీ అన్ని వృత్తులు చేయాలంటే వాళ్ళలో ఎంత నైపుణ్యం కావాలి. వాళ్ల నైపుణ్యం గురించి ఏనాడైనా మాట్లాడుతున్నారా? ఇవన్నీ అడగకుండానే సమాజాన్ని అడిగే ప్రశ్నలు. శ్రమ సౌందర్యాన్ని చెక్కిన శిల్పంలా అక్షరాల్లో ఎలా అందించారో చూడండి.

*"నాన్నా...*
*సాయంత్రం చేపల బుట్ట పట్టుకొని*
*నీవెనకాలే నేనూ వచ్చేవాణ్ణి*
*నువ్వు గబగబా నడుస్తుంటే*
*నువ్వు గమనించేవాడివో లేదో గానీ*
*ఆ రంగరాజుకోడు కాల్వంతా*
*నీ అడుగుల్తో పరవశించేది*
*ఆ కాల్వలో ప్రవహించే నీరు కూడా*
*నీ స్పర్శతో పవిత్రమయ్యేది*
*ఆ గట్టునుండే ముళ్లన్నీ*
*నీ అడుగుల కింద మెత్తని పువ్వుల్లా మారిపోయేవి*
*నువ్వేమీ వాటిని గమనించేవాడివి కాదు*
*ఆ తెల్లని పువ్వుల బుగ్గలప్పుడప్పుడూ*
*సిగ్గుతో ఎర్రబడేవి*
*చేదిపరిగలు, కొర్రమేనులు, కట్టిచేపలు,*
*మీసం మెలేసే పెద్దరొయ్యలు...*
*విషం ముళ్ళతో గుచ్చాలనుకునే ఇంగిలాలు*
*నీ చేతుల్లోపడేసరికే దొందుల్లాగో,*
*బొమ్మిడాల్లోగో మారిపోయేవి."*

శ్రామిక వృత్తులతో వాళ్ళు నిత్యం ప్రాణాలతో చెలగాటం చేయాల్సివస్తుంది. వాటన్నింటినీ ఎదిరించాలంటే గుండె ధైర్యం ఉండాలి. ఆ వృత్తులలోని నైపుణ్యాన్ని, ఆ వృత్తుల్లోని సాధక బాధల్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించటం ఈ వర్ణంలో కనిపిస్తుంది. ఇది చదువుతున్నప్పుడు ఆయా వృత్తులు చేసే వాళ్లు అవి తమ వృత్తులే అని అనుభూతి చెందుతారు. అందుకే ఈ ఆత్మకథ కేవలం కులఅవమానాలను మాత్రమే వర్ణించలేదు, శ్రామిక సౌందర్యంలోని ఔన్నత్యాన్నీ మన కళ్ళ ముందు నిలబెట్టి చూపిస్తుంది. భారతదేశవ్యాప్తంగా ఈ వృత్తులు చేసే వాళ్లంతా దీన్ని తమ పని గానూ, తమ జీవితంగానే భావిస్తారు. పైకి తన నాన్న గురించి చెబుతున్నట్లే అనిపిస్తున్నా, భారతదేశంలోని కుల వృత్తుల గురించి సాధారణీకరించిన తీరును ఇక్కడ ప్రత్యేకంగా గమనించాలి. ఇంకా ఈ శ్రామిక సౌంర్యాన్ని దృశ్యాత్మకంగా వర్ణించిన తీరు అనేక వృత్తుల వారిని ఇదంతా తమ జీవిత మేనని భావించేలా చేస్తుంది.

*"నాన్నా... నువ్వు*
*నా బాల్యాన్నంతా తీపిగుర్తులతో నింపావు*
*నన్నూ నీతో పాటే పొలాలకు తీసుకెళ్ళేవాడివి*
*నువ్వు పొలంలో వరికోత కోస్తుంటే*
*నీచేతిలో కొడవలి వణికిపోయేది*
*పోటీపడి మరీ*
*వరికంకులన్నీ నీచేతిలో ఒదిగిపోయేవి*
*నాకూ చాలా సరదా అనిపించేది*
*నేనూ అలా కోయాలనుకునేవాణ్ణి*
*ప్రయత్నించి వరితో పాటు చేయినీ కోసుకున్నప్పుడు*
*నువ్వు పడిన హడావిడిలో*
*నాకా బాధే తెలిసేదికాదు*
*నాన్నా... నువ్వు*
*పొలం దున్నుతుంటే*
*అలుపూ సొలుపూ లేకుండా*
*నీతో పోటీపడి మరీ*
*ఆ ఎద్దులు పరిగెట్టాలనుకునేవి*
*నీ వెనకాలో/ నీ ముందో/ఎవరోకరు*
*నాగళ్ళు దున్నతుంటే/ నిన్ను చూసి వాళ్ళు*
*వాళ్ళని చూసి నువ్వూ పోటీ పడుతుంటే*
*పనిలోనే భలే పసందుంటుందనిపించేది"*

అని ఒక రైతుని, ఒక రైతు కార్మికుడ్ని ఆ పనిలోని శ్రామిక సౌందర్యాన్ని కళ్ళ ముందు ఉంచినప్పుడు, అది చదివే పాఠకుడు ఈ జీవితం కేవలం దార్ల వెంకటేశ్వరరావు గారు, వాళ్ళ తండ్రికి సంబంధించినది మాత్రమే అని అనుకో గలుగుతారా? ఇలాంటి శైలినే తన జీవితాన్ని చెప్తూనే సత్యాన్ని కళాత్మకంగా ఆవిష్కరించడమంటారు

పొద్దున్నుండి కొబ్బరి చెట్లో, తాడిచెట్లో ఎక్కి కష్టపడి కూడా తమ కోసం వాళ్ళ నాన్నగారు అంత కష్టపడడాన్ని గమనించే తనకు తననాన్నంటే ఎక్కడలేని ప్రేమనిపించేదం టారు రచయిత. తల్లీ, తండ్రి చేసే పని పిల్లలు దగ్గరుండి గమ నిస్తే, వాళ్ల పట్ల గౌరవ మర్యాదలు అనుబంధాలు ఎలా పెనవేసుకుంటాయో ఈ ఆత్మకథ మనకి తెలియజేస్తుంది.

***కోనసీమ ప్రాంతంలోని 'పాలేరుతనం' అనేది వెట్టిచాకిరీ వ్యవస్థను పోలి ఉంటుంది. దాని వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక అణచివేతను కళ్ళకు కట్టినట్లు స్వీయానుభవంతో వివరించారు. భూస్వాములకు, పేదలకు మధ్య జరిగే ఒక కఠినమైన ఒప్పందంగా మొదలయ్యే ఈ విధానం, క్రమంగా ఒక వ్యక్తిని బానిసగా మార్చి, ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే సామాజిక బహిష్కరణకు గురిచేసేంత క్రూరంగా ఉండే దని రచయిత వివరించారు.***

పేదరికం వల్ల తన అన్నను పాలేరుగా పంపాల్సి రావడం, అనుకోని పరిస్థితుల్లో రచయిత ఒకరోజు ఆ పనికి వెళ్ళినప్పుడు ఎదురైన అవమానకర అనుభవాలు ఇందులో అనేకమంది పాలేరుతనం వల్ల అనుభవించిన కష్ట, నష్టాల ను, యజమానుల అమానుష ప్రవర్తనను, పెట్టిన పాచి అన్నాన్ని నిరసిస్తూ, ఆత్మగౌరవంతో ఆ బానిస సంకెళ్ళను తెంచు కుని బయటకు రావడాన్ని ఈ వృత్తాంతం శక్తివంతంగా చిత్రించింది.

***కుల ఆధిక్యతతో పాటు, శ్రమ దోపిడి ఎలా జరిగేదో కోస్తా ప్రాంతాల్లోని పాలేరు వ్యవస్థ గురించి అధ్యయనం చేసే వారికి ఇది గొప్ప చారిత్రక పత్రంలా ఉపయోగపడుతుంది.***

కోస్తా ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం కొబ్బరి చెట్లు, తాడి చెట్లతో ఎలా ముడిపడి ఉందో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు తన నెమలి కన్నులు ఆత్మకథ ద్వారా ఎంతో సహజం గా ప్రాదేశిక అనుభూతిని కలిగిస్తూ తన ఆత్మకథలో వివరిం చారు. కోస్తా తీరప్రాంత (కోనసీమ) పేద ప్రజల జీవితం తాటి, కొబ్బరి చెట్లతో ఎంతగా పెనవేసుకుపో యిందో అత్యంత సహజంగా చిత్రించారు.

**ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో ఆకలిని తీర్చుకోవడానికి తాటి చెట్టు ఒక 'కల్పవృక్షం'లా ఎలా ఉపయోగపడేదో వివరిస్తూ.. తాటి ముంజులు, తాటి పండ్లు, వాటితో చేసే కుడుములు, రొట్టెలు, భూమిలో పాతర వేసి పండించే తేగలు వంటి ఆహారపు అలవాట్లను ఆయన గుర్తుచేసుకున్నారు.**

కేవలం ఆహారంగానే కాక, తాటాకులతో ఇళ్లు కప్పుకో వడం, గొడుగులు, బుట్టలు అల్లుకోవడం వంటి జీవనోపాధి అంశాలను ప్రస్తావిస్తూనే, ఆనాటి సామాజిక స్థితిగతుల్లో కులం, పేదరికం తెచ్చే సవాళ్లను తన తల్లిదండ్రుల నిరంతర శ్రమ, క్రమశిక్షణ ద్వారా ఎలా అధిగమించారో వివరించారు.


తన అనుభవాల ద్వారా నాటి సమాజంలో దళితులు, పేద వారి పట్ల అగ్రవర్ణాలు ప్రదర్శించిన వివక్షా పూరిత వైఖరిని స్పష్టంగా వివరించారు. పేదవారు తమ అవసరాల కోసం పాలు కొనాలంటే అగ్రవర్ణాల ఇళ్ల వద్ద ఎదురుచూడాల్సి వచ్చేదని, వారు నీళ్లు కలిపిన పాలు ఇచ్చినా భరించక తప్పని పరిస్థితి ఉండేదని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో, దళితులు తమ గేదెల పాలను అమ్ముదామంటే అగ్రవర్ణాల వారు అనేక వంకలు పెడుతూ, పాలల్లో నీళ్లు ఉన్నాయని నెపంతో తక్కువ ధర ఇచ్చేవారని లేదా డబ్బుల కోసం పదే పదే తిప్పించుకునేవారని ఆవేదన వ్యక్తం చేశారు. "కొందామంటే కొరివి (ఖరీదు), అమ్ముదామంటే అడవి (అడిగేవాడు లేడు)" అన్న చందంగా సాగిన ఈ ఆర్థిక, సామాజిక దోపిడీ.. పేదవారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాక, వారి కష్టార్జితానికి సరైన విలువ దక్కకుండా చేసే ఆధిపత్య పోకడ లను ప్రతిబింబిస్తుంది.

అక్షరజ్ఞానం లేని ఒక సామాన్య తల్లి తన బిడ్డలకు పౌరాణిక గాథలను వినిపించడం ద్వారా, కేవలం కథలను మాత్రమే కాక గొప్ప ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నూరిపోసింది. అరుంధతీదేవి, వశిష్ఠుడు, వ్యాసుడు వంటి మహర్షుల జన్మవృత్తాంతాలను వివరిస్తూ, భారతీయ అగ్రశ్రేణి మేధావుల మూలాలు అణగారిన వర్గాల్లోనే ఉన్నాయనే చారిత్రక సత్యాన్ని బిడ్డల మనసుల్లో నాటింది. "మనం కూడా ఆ మహనీయుల వంశానికి చెందిన వారమే" అని చెప్పడం ద్వారా వారిలో సాంస్కృతిక ఔన్నత్యాన్ని, తమ అస్తిత్వం పట్ల గర్వాన్ని నింపింది. ఈ మౌఖిక కథా సంప్రదాయం పేదరికం, వివక్ష వంటి సామాజిక అవరోధాలను అధిగమించి, ఉన్నత లక్ష్యాలవైపు సాగడానికి అవసరమైన నైతిక బలాన్ని, స్ఫూర్తిని ఇచ్చే ఒక గొప్ప విద్యా సాధనంగా ఆత్మకథ స్ఫూర్తినిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో పేదవాళ్ళు చదువుకోవాలంటే పడే కష్టాలు సామాన్యం కాదు. దానికితోడు కులం కూడా తోడైతే ఇంకెలా ఉంటుంది? గ్రామీణ ప్రాంతాల్లో దళిత, పేదవిద్యార్థులు జ్ఞానాన్ని సముపార్జించుకోవడానికి పడే కష్టాలు వర్ణనాతీతమని ఈ వృత్తాంతం నిరూపిస్తుంది. కనీసం ఒక దినపత్రిక చదువుకోవాలన్నా ఆధిపత్య వర్గాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిరావడం, దానికి ప్రతిఫలంగా రైస్ మిల్లుల్లో ప్రాణాలకు తెగించి ధాన్యం బస్తాలు మోయడం, ఊక గొట్టాలను శుభ్రం చేయడం వంటి కఠినమైన పనులు చేయాల్సిరావడం నాటి సామాజిక వివక్షకు నిదర్శనం. ఆకలిని తట్టుకోలేక మిల్లులోని తౌడును తింటూనే, పత్రికలోని అక్షరాల కోసం శ్రమించడం చదువు పట్ల ఉన్న తపనను చాటిచెబుతుంది. పేదరికానికి కులం తోడైనప్పుడు, ఒక సామాన్యమైన హక్కును పొందడానికి కూడా శారీరక శ్రమను మించిన మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి ఈ అను భవం స్పష్టం చేస్తోంది. పుట్టడం వరకు పిల్లలకు ఏమీ తెలియకపోయినా, పుట్టిన తర్వాత ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయి. తమ కులం ఏమిటో తెలుస్తుంది. తమ ఆర్థిక పరిస్థితులు, తమ కులాలే తమకొక అస్తిత్వాన్ని ఇస్తాయి. వీటిని కేంద్రీకరించి, తన జీవిత కేంద్రం గా సాధారణీకరించడమే ఈ ఆత్మకథలో కనిపించే ప్రధాన మైన వస్తువు. ఈ ఆత్మకథ బాల్యాన్ని కేంద్రంగా చేసు కుంది. కాబట్టి అందరి బాల్యం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ ఆత్మకథలో కనిపిస్తుంది. అందుకేనేమో ఈ వాక్యాలతో తన ఆత్మ కథను ముగించారు.

*"బాల్యం ఒక చెలమ లాంటిది*
*నీళ్లు ఎన్నో లేవనిపిస్తుంది.*
*ఆ నీళ్లు తోడేయగానే*
*మరలా నీళ్లు ఊరిపోతాయి.*
*జ్ఞాపకాలూ, ఆ బాల్య జీవితమూ అంతే.*
*ఇంకేముందిని అనిపిస్తుంది.*
*గతంలోకి వెళ్ళగానే మళ్ళీ*
*దొంతరదొంతరలుగా,*
*అలలు అలలుగా,*
*పొరలు పొరలుగా*
*కనిపించే జీవితంలా బయటకొస్తుంది.*
*బాల్యం ఏముందనిపిస్తూనే,*
*ఎంతమహోన్నతమైనదో కనిపించీ కనిపించని*
*ఒక దోబూచులాట లాంటిది."*

మొత్తం మీద నెమలి కన్నులు ఆత్మ కథలో కులం వల్ల కలిగే అవమానాలు, ఆర్థిక కష్టాలు చెప్తున్నావాటిని చెప్తున్నట్టుగా కాకుండా, బాల్యాన్ని బాల్యంలో వచ్చే కష్ట సుఖాలను వివరి స్తున్నట్లు చెప్తూనే, ఒక కళాత్మక సత్యంగా దృశ్య వర్ణనలతో కళ్ళకు కట్టినట్లు చూపించడం ఈ ఆత్మకథ ప్రత్యేకత. బాల్యంలోని సహజమైన అనుభవాల గుండా ఒక కళాత్మక సత్యంగా ఆవిష్కృతమయ్యాయి. పసిమనసులోని కుతూహలం, ఆటపాటలు, ప్రకృతితో మమేకమవ్వడం వంటి అంశాలను వివరిస్తూనే, వాటి వెనుక అంతర్లీనంగా ఉన్న సామాజిక అణచివేతను రచయిత ఎంతో నిశితంగా చిత్రించారు. ఎక్కడా ఉపన్యాస ధోరణి లేకుండా, ఒక కళాత్మక సంవేదనతో నాటి సామాజిక వాస్తవికతను ప్రతిబిం బించడం ఈ ఆత్మకథను ఒక విశిష్ట సాహిత్య ఖండంగా నిలబెట్టింది.

డి. సాయినాథ్ రెడ్డి
6305584064
హైదరాబాద్ విశ్వవిద్యాలయం



నినాదం
నిఖార్సైన జర్నలిజం
# సాహితీ లహరి
ఆదివారం 05-04-2026

## కాశీ క్షేత్రం...



సీ.
జ్ఞానభాండమ్ములు శాఖోపశాఖలై
విలసిల్లు చున్నవి విరివిగాను
సృష్టి కర్తయె తన దృష్టిని సారించి
నెలకొల్పుకొనె నని నేమముగను
నాస్వాదనమునకై యరుదెంచుచుందురే
యష్టదిక్కుల నుండి హాయిగాను
తనివి తీరగ గ్రోలి తరలుచుందురు తమ
స్వస్థలమ్ములకును స్వస్థత గని

తే.గీ.
పంచుచుందురు ప్రజలకు పాటిగాను
విస్తుగొలుపు నీ వింతలు విలసితముగ
సకల భక్త మోక్ష ప్రద స్థావరమ్ము
శివ కృపాలబ్ధ వరము కాశీపురమ్ము.



జి.గోవర్ధన్, తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం,
మహబూబ్ నగర్ 509001
8106384812

## చిన్న ఉత్సాహం ఎంతో ప్రోత్సాహం..!



కడుపు నిండకపోయినా పర్వాలేదు
కళనే నమ్ముకున్న ప్రాణం కళాకారుడు;
శూన్యం నుండి అద్భుతం సృష్టిస్తూ
కళాక్షేత్రంలో ధన్యజీవి ఇతడు.

వారికీ ఇచ్చే సన్మానం కేవలం మెడలో
వేసే సువాసన పూలమాల కాదు;
వారి నిరంతర కళా సాధనను మెచ్చి
సమాజం ఇచ్చే గొప్ప భరోసా!

కళాకారుడి వేదనను అర్థం
చేసుకున్న రోజే నిజమైన సత్కారం;
ఆదరణ లేని చోట మౌనంగా
విలపిస్తుంది ఆ ప్రతిభా వనం.

ప్రోత్సాహం అనే చినుకు పడితేనే
కళావృక్షం కలకాలం చిగురిస్తుంది;
గౌరవం దక్కిన చోటే ఉత్సాహంతో
కొత్త సృజన ఉరకలెత్తుతుంది.

కళను బ్రతికిస్తేనే మన జాతి
చరిత్ర సజీవంగా మిగులుతుంది;
కళాకారుని వెన్నుతట్టి చూడు..
లోకమే కళాత్మకంగా మారుతుంది!

ఒక చిన్న ఉత్సాహం.. ఎంతో ప్రోత్సాహం
ఏనుగుల బలం తోడున్నట్లుగా;
కళాకారుని కదిలించే మంత్రంలా
సృజనను రెట్టింపు చేసే బహుమానం.

కళలకు గౌరవం.. ఘన సత్కారం
చప్పట్ల హోరులో అది గొప్ప స్వాగతం;
మనసంతా నిండిన కళాభిమానంతో
కళ్లలో వికసించే కాంతి తరంగం!

భుజాలపై శాలువా.. కళపై బాధ్యత
తనువు కప్పిన వస్త్రం మాత్రమే కాదు;
కళామతల్లికి అర్పించిన సంప్రదాయం
కళా పోషణకు అరుదైన ఘనకార్యం!


కళాకారుడు ఆశించేది సిరులు కాదు..
మెచ్చే నాలుగు మంచి మాటలు!
సృజనకు మనం ఇచ్చే చిరు సాయం
తరతరాల సంస్కృతికి పోసే ప్రాణవాయువు.

రండి.. కళలను కాపాడుకుందాం!
కళాకారులను గుండెల్లో నింపుకుందాం..
కళ వికసిస్తేనే లోకం వెలుగుతుంది,
కళాకారుడు నవ్వితేనే కాలం మురుస్తుంది!

కొప్పుల ప్రసాద్,
నంద్యాల
9885066235



# శిరంశెట్టి కాంతారావు
# వాళ్ళు గెలవాలి




భూర్జువా సమాజంలో నిజంగా వీళ్ళు గెలిచారా?

డా.బి.ఆర్. అంబేద్కర్ "తమ నాగరికత కొన్నివేల సంవత్సరాల నాటిదని గొప్పలు చెప్పుకునే ఈ దేశంలో ఈ ఆదిమవాసులు ఈనాటికి ప్రాచీన కాలంనాటి దుర్భర అనాగరిక పరిస్థితిలోనే నివసిస్తున్నారంటే ఏమనాలి! కానీ ఇది మాత్రం నగ్నసత్యం" అన్నారు. ఈ సామాజిక వెనుకబాటుతనంపై అంబేద్కర్ వ్యక్తం చేసిన ఆవేదన, అణగారిన వర్గాల పట్ల ఆయనకున్న అపారమైన చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. సమాజం ఎదుర్కోబోయే సవాళ్లను వెయ్యేళ్ల ముందే ఊహించి, అందరికీ సమానత్వం దక్కాలని కలగన్న గొప్ప దార్శనికుడు ఆయన.

యుద్ధాలు తరచుగా సామాన్య ప్రజల క్షేమం కోసం కాకుండా, పాలకుల వ్యక్తిగత ఆధిపత్యం కోసమే జరుగుతుంటాయి. శ్రీశ్రీ అన్నట్లుగా 'ఏ యుద్ధం ఎందుకు జరగెనొ? ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?' అన్న ప్రశ్నార్థక చరిత్రలో శ్రమ, ఆకలి, భూమి కోసం జరిగే సహజ పోరాటాల ఆనవాళ్లు కాలక్రమేణా తారుమారయ్యే ప్రమాదం ఉంది. అధికార గర్వంతో సాగే విధ్వంసం మధ్య, సామాన్యుడి వేదనను మరియు వాస్తవ చరిత్రను చెరిగిపోని 'సజీవ సాక్ష్యాలు'గా భద్రపరిచే శక్తి ఒక్క సాహిత్యానికే ఉంది!

వందలాది కథలు, నవలలతో బహుజన దృక్పథాన్ని బలంగా వినిపిస్తున్న శిరంశెట్టి కాంతారావు గారి రచనల్లో 'వాస్తవికత' ప్రధానాంశం. కేవలం కల్పనలకు పరిమితం కాకుండా, రాజ్యహింస, శ్రమదోపిడీ, కుల వివక్ష వంటి సామాజిక సంక్లిష్టతలను అధ్యయనం చేసేందుకు ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆ జీవితాలను అనుభవించి అక్షరీకరిస్తారు. ఈ క్రమంలోనే గిరిజన పోరాట పటిమను, వారి అణచివేతను అత్యంత విశ్లేషణాత్మకంగా చిత్రించిన 'వాళ్ళు గెలవాలి' నవల తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానాన్ని సంతరించుకుంది. నవ తెలంగాణ దినపత్రిక వారు భాగ్యరెడ్డి వర్మ స్మృత్యర్థం నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతిని అందుకుంది. అటువంటి ఈ నవల్లోకి వెళ్ళి ఎవరూ గెలిచారో చూసోద్దాం.

గత వారం రాసిన సలీం 'లోహముద్ర' వ్యాస శైలిలోనే, ఈ నవల కూడా మూడు తరాల ఎరుకల జీవిత చిత్రణను అద్భుతంగా ఆవిష్కరించింది. తరతరాలుగా మారని సామాజిక సమస్యల నేపథ్యంలో, వెంకటయ్య–వెంకటమ్మ కుటుంబ కథ ద్వారా ఎరుకల తెగ జీవన పోరాటాన్ని, ముఖ్యంగా ఆ జాతి ఎదుర్కొంటున్న 'భూమి సమస్య'ను ప్రధాన ఇతివృత్తంగా ఈ నవల అత్యంత వాస్తవికతను వికసింపజేసింది.

### ఎరుకల ఆత్మగౌరవ ప్రస్థానం: వాళ్లుగెలవాలి విశ్లేషణ

ఈ నవలలో గోపయ్య భార్యలైన ముత్తవ్వ, సాయవ్వల ఉదంతం ద్వారా అప్పటి కులాచారాల కఠినత్వాన్ని, కుటుంబ సంఘర్షణలను రచయిత చిత్రించారు. అగ్నిపరీక్షల వంటి సంప్రదాయాల్లో నెగ్గి తన శీలాన్ని నిరూపించుకున్న ముత్తవ్వ ఒక తరానికి ప్రతీకగా నిలిస్తే, తదనంతర పరిణామాల్లో ఆమె ఇంటికి ఇల్లరికంగా వచ్చిన 'గరిక వెంకటయ్య' పాత్ర కథను మరో మలుపు తిప్పుతుంది. 'మేం ఏకలవ్యుని సంతతివారం, పూర్వం రాజులం' అనే చారిత్రక ఎరుకతో, కుల పంచాయతీలు మరియు సామాజిక సంబంధాల్లో చురుగ్గా పాల్గొంటూ వెంకటయ్య తన తెగ ఆత్మగౌరవానికి ప్రతినిధిగా కనిపిస్తాడు.

వెంకటయ్య జీవితంలోకి జాన్సన్, జయవాణి అనే ఉపాధ్యాయ దంపతుల రాక ఒక సామాజిక విప్లవానికి నాంది పలికింది. తొలుత దొర ఆజ్ఞ మేరకు వారి నివాస ఏర్పాట్లు చూసిన వెంకటయ్య, ఆ తర్వాత వారి సాన్నిహిత్యంతో చదువు విలువను గుర్తించాడు. ఉపాధ్యాయులు స్వయంగా చొరవ తీసుకుని వెంకటయ్య పెద్దకొడుకు వాసును తమ ఇంట్లోనే ఉంచుకుని చదివించడం, వెంకటయ్య కుటుంబంలో విద్యా చైతన్యానికి పునాది వేసింది. వాసును స్ఫూర్తిగా తీసుకుని దేవేందర్, గిరి వంటి మిగతా పిల్లలు కూడా ఉన్నత చదువుల బాట పట్టడం, అణగారిన వర్గాల సామాజిక ఎదుగుదలను సూచిస్తుంది. అయితే, ఒక గిరిజన కుటుంబం విద్య ద్వారా సాధిస్తున్న ఈ పురోగతి, అప్పటికే స్థిరపడిన భూస్వామ్య వర్గాల్లో అసూయను, ఆందోళనను రేకెత్తించిందనడానికి ఈ పరిణామాలు ఒక నిదర్శనం.

ఈ నవలలో దేవేందర్, కుసుమకుమారిల ప్రేమ ఉదంతం కుల వ్యవస్థలోని క్రూరత్వాన్ని మరియు దానికి ఎదురునిలిచిన ధిక్కార స్వరాలను అత్యంత విశ్లేషణాత్మకంగా ఆవిష్కరించింది. దేవేందర్‌పై దొర సాగించిన భౌతిక దాడిని నిరసిస్తూ, వెంకటమ్మ 'సివంగిలా' ఎదురుతిరగడం ఈ నవలలో ఒక చారిత్రక ఘట్టం. ఆనాడు చాకలి ఐలమ్మ చూపిన తెగువను వెంకటమ్మలో చూసిన జనం ఆమెను విప్లవ ప్రతీకగా గుర్తించారు.

అగ్రవర్ణ అహంకారం చట్టాన్ని సైతం తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూసినా, దేవేందర్ దంపతులు మేజర్లు అని నిరూపితమై చట్టబద్ధంగా ఒక్కటవ్వడం అణగారిన వర్గాల విజయానికి నిదర్శనం. అయితే, ఈ సామాజిక ఘర్షణల వల్ల కలిగిన మానసిక క్షోభతో వెంకటయ్య తన ఊరును వదిలి 'మొలకలపల్లి'కి చేరుకుంటాడు. "పాములకు భయపడే ఎరుకలోడు ఏం ఎరుకలోడు?" అన్న ఆయన మాటలు, భౌతికమైన భయాల కంటే ఆత్మగౌరవంతో బతకడమే గొప్పదని చాటిచెబుతాయి. పాముల పుట్టల నిలయమైన అడవిని సైతం సాగుభూమిగా మార్చగలిగే శ్రమశక్తి, ఆ తెగకున్న అజేయమైన పట్టుదలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది.

వెంకటయ్య కుమారులైన వాసు, దేవేందర్‌లు ఉన్నత చదువులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడం, ఆ కుటుంబం సామాజికంగా ఎదుగుతున్న తీరుకు నిదర్శనం. అయితే, ఐ.టి.డి.ఏ ఉద్యోగం రాకుండా దొరలు అడ్డుపడటం, నివాసం ఉంటున్న భూమిని ఖాళీ చేయమని ప్రకాశం ఒత్తిడి చేయడం ద్వారా అగ్రవర్ణ అహంకారం అణగారిన వర్గాల పురోగతిని ఎలా అణచివేయాలని చూస్తుందో స్పష్టమవుతుంది. అడవిని సాగుభూమిగా మార్చిన శ్రమజీవులకే నేడు గూడు లేకుండా పోవడం గమనార్హం.

మరోవైపు, దేవేందర్ యువజన సంఘాల ద్వారా సామాజిక స్పృహను పెంపొందించుకుని, రెవెన్యూ శాఖలో అధికారిగా బాధ్యతలు చేపట్టడం ఒక కీలక మలుపు. ప్రభుత్వ పథకాల అమలులో ఆయన ప్రదర్శించిన నిబద్ధత, అర్హులైన పేదలకు న్యాయం చేయాలనే తపన చివరకు స్వగ్రామంలోనే ఆయనపై వ్యతిరేకతకు దారితీసింది. రాజకీయ ప్రాబల్యం ఉన్న వర్గాలు సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టించి, ఒక నిజాయితీ గల అధికారిపై పగ పెంచుకునేలా చేయడం ఈ వ్యవస్థలోని కుట్రపూరిత వైఖరిని విశ్లేషణాత్మకంగా ఆవిష్కరిస్తుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థ రాజకీయ నాయకుల చేతుల్లో ఎలా కీలుబొమ్మగా మారుతుందో తహశీల్దార్ మాటల ద్వారా రచయిత ఇక్కడ విశ్లేషణాత్మకంగా చిత్రించారు. దేవేందర్ 'వి.ఎ.ఓ'గా నిజాయితీగా పనిచేస్తున్నా, ఎన్నికల వేళ రాజకీయ ప్రయోజనాల కోసం స్వార్థపరులు ప్రజలను రెచ్చగొట్టి అతనికి వ్యతిరేకంగా ధర్నాలు చేయించడం వ్యవస్థలోని కుట్రలకు నిదర్శనం. ఉన్నతాధికారుల విచారణలో దేవేందర్ నిర్దోషి అని తేలినా, అగ్రవర్ణ అహంకారంతో నిండిన ప్రకాశం వంటి నాయకులు దానిని జీర్ణించుకోలేకపోయారు.

"ఏకులా వచ్చి మేకులా తయారయ్యారు" అనే వారి అక్రోశం వెనుక, అణగారిన వర్గాల వారు విద్యను, భూమిని, అధికారాన్ని దక్కించుకోవడాన్ని చూసి ఓర్వలేని సామాజిక వివక్ష స్పష్టంగా కనిపిస్తుంది. ఎరుకల కుటుంబంలో కోడళ్లు ఉద్యోగాలు సాధించడం, చిన్న కొడుకు న్యాయవాదిగా ఎదగడం వంటి పరిణామాలు ఆ వర్గాల ఆత్మగౌరవ ప్రస్థానాన్ని సూచిస్తాయి. ఈ క్రమంలోనే ఆర్డీవో (=.ణ.ూ) ఆదేశాల మేరకు పోడు భూముల వివరాలు సేకరించడం, గిరిజనులకు పట్టాలు ఇచ్చే ప్రక్రియ ప్రారంభం కావడం, వెంకటయ్య కుటుంబానికి, ఆ ఊరి భూస్వామ్య వర్గాలకు మధ్య సాగే అంతిమ పోరాటానికి వేదికగా నిలుస్తుంది.

దేవేందర్ తన విధి నిర్వహణలో భాగంగా అర్హులైన వారితో పాటు తన తండ్రి సాగు చేస్తున్న పోడు భూమికి కూడా పట్టా ఇప్పించడం, ఆ ఊరి భూస్వామ్య వర్గాలకు కంటగింపుగా మారింది. కలెక్టర్ కమిటీ ద్వారా ఆ భూమి వెంకటయ్యకే చెందుతుందని తేలినా, ఓర్వలేని ప్రకాశం వంటి వ్యక్తులు కోయ ప్రజలను పావులుగా వాడుకుని అక్రమంగా గుడిసెలు వేయించారు. దొర మంత్రిగా ఎదగడంతో అధికారం, మిగిలిన వారంతా ఏకమై వెంకటయ్య కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి.

ఒకవైపు వి.ఎ.ఓల హక్కుల కోసం దేవేందర్ సాగించిన పోరాటం సఫలమై వారంతా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందినా, మరోవైపు వ్యవస్థాగత కుట్రల వల్ల దేవేందర్ సస్పెన్షన్‌కు గురవ్వడం, వెంకటయ్య భూమి పట్టా రద్దు కావడం గమనార్హం. మీడియా సైతం ఏకపక్షంగా వ్యవహరించి వారిపై బురద చల్లడం, డబ్బు మరియు అధికారం ముందు కోర్టులో ప్రాథమికంగా న్యాయం దక్కకపోవడం, ప్రజాస్వామ్యంలోని వ్యవస్థలు బలవంతుల పక్షాన ఎలా నిలుస్తాయో ఈ నవల్లో అనేక సంఘటనలను ఉదాహరణగా చూపవచ్చు.

అధికార బలంతో భూమిని కోల్పోయిన వెంకటయ్య కుటుంబానికి సాగర్ దంపతుల అండ, న్యాయవాది మహమ్మద్ ఖాన్ మేధస్సు తోడవ్వడం నవలకు ఒక ఆశావాహ మలుపునిచ్చింది. ఈ కేసును 'ట్రైబల్ కోర్టు'కు తీసుకెళ్లడం ద్వారా అగ్రవర్ణాల కుట్రలు చిక్కుముడి పడ్డాయి. స్వార్థపరుల చేతుల్లో పావులుగా మారిన కోయ ప్రజలు వాస్తవాన్ని గ్రహించి, తాము అక్రమంగా గుడిసెలు వేశామని ఒప్పుకోవడం సామాన్యుల మధ్య ఐక్యతకు నిదర్శనం. చివరికి న్యాయం గెలిచి భూమి వెంకటయ్య వశమైనా, తమను ఇబ్బంది పెట్టిన వారిపై కక్ష సాధించకుండా కేసులను వెనక్కి తీసుకోవడం ఆ కుటుంబం యొక్క సంస్కారాన్ని చాటుతుంది.

వెంకటయ్య మరణం ఒక తరం ముగింపును సూచిస్తే, ఆయన మనుమడు రవి హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతూ కారులో ఊరికి రావడం ఆధునిక విద్యా చైతన్యానికి ప్రతీక. కారు ప్రయాణంతో నవల ముగియడం అనేది ఎరుకల తెగ ప్రస్థానం వెనుకబడిన తనం నుండి అభివృద్ధి పథం వైపు సాగిందని చెప్పడానికి ఒక అద్భుతమైన సంకేతం. ఆస్తి కోసం కాకుండా అస్తిత్వం కోసం సాగించిన ఈ పోరాటంలో 'వాళ్లు గెలిచారు' అని రచయిత ఈ ముగింపు ద్వారా నిరూపించారు. అందుకే ఈ నవలకు ఈ పేరు కాకుండా 'ఊరు భూమిని జయించింది' అనే పేరు పెట్టాలనుకున్న రచయిత ఆలోచన సరైనదే. కానీ ఆ పేరును చివర్లో వద్దనుకొని, వాళ్ళు గెలవాలి' అనే పేరు పెట్టానని ఇంటర్వ్యూలో తెలియజేశారు.

### 'వాళ్ళు గెలవాలి': నవల ఎదిరించిన సవాళ్లు

శిరంశెట్టి కాంతారావు గారి 'వాళ్ళు గెలవాలి' నవల కేవలం ఒక కుటుంబ గాథ కాదు, అది తెలంగాణ మట్టిలో అణగారిన వర్గాల, ముఖ్యంగా ఎరుకల తెగ సామాజిక మరియు ఆర్థిక పరిణామక్రమానికి ఒక సజీవ సాక్ష్యం. గోపయ్య, వెంకటయ్య, దేవేందర్ అనే మూడు తరాల పాత్రల ద్వారా ఈ నవల శతాబ్దాల నాటి భూమి సమస్యను, విద్యా చైతన్యాన్ని అత్యంత విశ్లేషణాత్మకంగా ఆవిష్కరించింది. కుల వివక్ష, అగ్రవర్ణ అహంకారం వంటి సామాజిక అవరోధాలను ఎదిరిస్తూనే.. అణగారిన వర్గాల ఎదుగుదలపై ఉన్నత వర్గాల్లో ఉండే అసూయను, రాజకీయ జోక్యాన్ని ఈ నవల నిలదీసింది.


కార్పొరేట్ మరియు భూర్జువా పోకడలు గిరిజన నేలను ఎలా కబళిస్తున్నాయో చూపిస్తూనే, 'విభజించు–పాలించు' కుట్రల ద్వారా పేదల మధ్య వైషమ్యాలు సృష్టించే శక్తుల ముసుగును రచయిత తొలగించారు. అక్షరాస్యతను ఒక ఆయుధంగా మలుచుకొని, అణచివేతపై ఆత్మగౌరవ పోరాటాన్ని సాగించిన తీరు ఈ నవలకు ఒక విప్లవాత్మక రూపాన్ని ఇచ్చింది. మొత్తంగా, ఈ నవల వ్యవస్థలోని ప్రతి లోపాన్ని ఒక సవాలుగా స్వీకరించి, అణగారిన గుండెల్లో ధిక్కార స్వరాన్ని రగిలించింది.

అక్కడితో ఆగకుండా ప్రాచీన కులాచారాల కట్టుబాట్ల నుండి ఆధునిక అస్తిత్వ పోరాటం వైపు సాగిన ఎరుకల జాతి ప్రస్థానాన్ని అద్భుతంగా చిత్రించింది. ముత్తవ్వ కాలం నాటి అగ్నిపరీక్షల వంటి ఆటవిక సంప్రదాయాల నుండి, 'మేము ఏకలవ్యుని సంతతి' అనే ఆత్మగౌరవ స్పృహతో వెంకటయ్య తరం కొత్త బాటలు వేసింది. ఉపాధ్యాయ దంపతుల ప్రోత్సాహంతో అందిన విద్య, కేవలం ఉద్యోగానికే పరిమితం కాకుండా దోపిడీని ప్రశ్నించే ఆయుధంగా మారి, అణగారిన వర్గాల్లో సామాజిక చైతన్యాన్ని రగిల్చింది. అయితే, భూమి చుట్టూ అల్లుకున్న వ్యవస్థాగత కుట్రలు, రాజకీయ ఒత్తిళ్లు గిరిజన హక్కులను కాలరాయాలని చూడటం నేటి ప్రజాస్వామ్యంలోని లోపాలకు నిదర్శనం. న్యాయపోరాటంలో చివరకు విజయం సాధించినా, దశాబ్దాల మానసిక ప్రశాంతతను, సామాజిక గౌరవాన్ని కోల్పోయి పొందిన ఈ విజయం ఒక 'అసంపూర్ణ గెలుపు'గానే మిగిలిపోయింది. భూర్జువా సమాజంలో మారకుండా ఉన్న అగ్రవర్ణ అహంకారం, అభివృద్ధిని చూసి ఓర్వలేని ద్వేషం, అణగారిన వర్గాల గెలుపును నిరంతరం ఒక సవాలుగానే మిగిలిపోతుంది.

నవల ముగింపులో వెంకటయ్య కుటుంబం న్యాయపోరాటం ద్వారా భూమిని దక్కించుకున్నప్పటికీ, ఈ విజయం వెనుక వారు మూల్యం చెల్లించుకున్న తీరు 'నిజంగా వీళ్ళు గెలిచారా?' అన్న ప్రశ్నను రేకెత్తిస్తుంది. దశాబ్దాల పాటు సాగిన ఈ పోరాటంలో ఆ కుటుంబం తన మానసిక ప్రశాంతతను, సామాజిక గౌరవాన్ని పణంగా పెట్టాల్సి వచ్చింది. ఒకవైపు దేవేందర్ వంటి విద్యావంతులు వ్యవస్థలో ఉన్నత స్థానాలకు చేరుకున్నా, మరోవైపు అగ్రవర్ణ అహంకారం 'ఏకులా వచ్చి మేకులా తయారయ్యారు' వంటి వ్యాఖ్యలతో వారి ఎదుగుదలను ద్వేషిస్తూనే ఉంది. చట్టబద్ధంగా భూమి దక్కినా, క్షేత్రస్థాయిలో ఇంకా మారని భూస్వామ్య పోకడలు, రాజకీయ కుట్రలు ఆ గెలుపును ఒక సవాలుగా మార్చాయి. భూర్జువా వ్యవస్థలో ఒక సామాన్య గిరిజన కుటుంబం సాధించిన ఈ విజయం, కేవలం ఒక ఆస్తి హక్కుగా కాకుండా, అపారమైన అవమానాలను భరించి సాధించుకున్న ఒక అసంపూర్ణ గెలుపుగానే మనకు కనిపిస్తుంది. శిరంశెట్టి కాంతారావు 'వాళ్ళు గెలవాలి' నవల ఆధునిక కాలంలో గిరిజన అస్తిత్వ వేదనను, ముఖ్యంగా భూమి చుట్టూ అల్లుకున్న సంక్లిష్టతలను వాస్తవిక దృక్పథంతో ఆవిష్కరించింది. 1/70, పెసా వంటి చట్టాలు అమలులో ఉన్నా, భూర్జువా వ్యవస్థలో పాలకవర్గాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ గిరిజన భూములను అన్యాక్రాంతం చేస్తున్న తీరును ఈ నవల ఎండగట్టింది. ఎరుకల మరియు కోయ తెగల మధ్య కృత్రిమ వైరుధ్యాలను సృష్టించి, వారి ఐక్యతను దెబ్బతీసే కుట్రలను రచయిత ఇందులో విశ్లేషణాత్మకంగా చిత్రించారు. వెంకటయ్య కుటుంబం చట్టబద్ధంగా విజయం సాధించినప్పటికీ, లక్షలాది గిరిజన కుటుంబాలు నేటికీ పట్టా పత్రాల కోసం అలమటిస్తుండటం ఈ గెలుపులోని సంకీర్ణతను సూచిస్తుంది. అక్షరాస్యత ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నిరూపిస్తూ, వెంకటయ్య వారసులు ఉన్నత స్థానాలకు చేరుకోవడం అణగారిన వర్గాలకు ఒక దిశానిర్దేశం. కేవలం ఒక కుటుంబం గెలవడమే కాకుండా, వ్యవస్థాగతమైన మార్పు వచ్చి ఏనాడైతే భూమి సమస్య లేని దేశంగా భారత్ నిలుస్తుందో, నాడే గిరిజన లోకానికి నిజమైన విజయం చేకూరుతుందని, అటువంటి రోజులు రావాలని ఆశిద్దాం.



డా.జరుపుల రమేష్
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగు విభాగం,
కాకతీయ ప్రభుత్వ కళాశాల, (స్వయం ప్రతిపత్తి), హనుమకొండ.
ఫోన్: 9618944654,



సీ. శ్రీసిరి మదివాస! సిరిధరా! సరసిజ
నయన! శరణుకోటి నరులకుల భ
యాపహారి ప్రభో! రఘునాథనాథ! వో
కమలనయన! వరా! కళల యిందు
వదనా! హరి! యరివైరాదుల పాలిట
వాలాధర! గిరిధర! కువలయ క
ళోద్ధర! పూర్ణకళాస్య! శశిప్రభా
భూషణ! మన్మథ పోషణ హరి!

తే.గీ.హల్లకాస్యమయాలచ్చి యరుణనాథ
సుమన పాలుడు లీలుడు సుంధరాక
రుడును కాంతులీనుండును యుత్తముండు
భవలత తృణీకరుడు భయాపహరుడు హరి!

కోట. విజయ్ కుమార్
హైదరాబాద్ కేంద్రీయ
శ్వవిద్యాలయం



## మెమొరీస్ ఆఫ్ గెట్ టుగెదర్ @ జడ్‌పిహెచ్ఎస్, చిట్యాల

ఆ రోజు
గుండెలన్నీ గండ దీపంలా
వెలిగిపోయాయి.
పాతికేళ్ళ బాల్యం
సినిమాగా మారి
70ఎంఎం స్క్రీన్‌పై ప్యాన్ ఇండియా మూవీలా
బాక్సాఫీస్ బద్దల్ కొట్టినట్లైంది.
బండెడు బాధలతో, భాద్యతలతో
బరువెక్కిన హృదయాలన్నీ
ఆ రోజెందుకో
తెల్లకాగితం వలె తేలిగ్గా
రెపరెపలాడుతూ గాల్లో తేలాయి.
అక్కడికొచ్చిన
అమ్మాయిల ముఖాలన్నీ
గునుగుపూలోలె వెలిగిపోయి
బొడ్డెమ్మలా మారి
బతుకమ్మ ఆట పాటల మాటలతో
సంగీత సభలా హోరెత్తి పోయింది.
అబ్బాయిల మెమొరీస్ అన్ని
5జి సెల్‌టవర్ సిగ్నల్ లా
జ్ఞాపకాల స్మృతులు మా మెమొరి చిప్‌లోకి చేరి
ఆటపాటల అల్లరి అలజడులన్నీ
పొంగిపొర్లాయి.
ఫస్ట్ బేంచ్ నుంచి
లాస్ట్ బేంచ్ దాక దోస్తుల ముచ్చట్లన్నీ
సముద్రపు అలాల్లా
ముందుకు వెనక్కి వెలుతూ
హృదయాలన్నీ తడిసిపోయి
మురిసిపోయారు.
ఆప్యాయంగా
పలుకుబడుల పలకరింపులతో
ఒకరినొకరు అల్లుకుపోయి
సింగారించుకున్న
సంక్రాంతి ముగ్గులా మారిపోయాం.
సార్ల సందేశాలు
మాపై వర్షపు చినుకుల్లా కురిసిన మాటలు
ఇంకా తడితడిగా
మదిలో మెదులుతూనే ఉన్నాయి.
మా బడి గదుల్లో గడిపిన
ప్రతి గడియ గడియను
నేమరేసుకుంటూ
నేమరేసుకున్న ప్రతి గడియను
గుండెల్లో భద్రపరుచుకున్నాం.
మా పిల్లల్ని మరిచి,
మేం పసి పిల్లల్లా మారి
పొద్దును పొలిమేరల్లోనే కట్టేసి
అయస్కాంతానికి
అంటిన ఇనుములా
అక్కన్నుంచి కచ్చుకదల్లేదు.


గిన్నారపు ఆదినారాయణ
9949532456



## వెరపు వేలుపు

(శిర్గావ్ జాతర తొక్కిసలాటలో
అసువులు నీడిన
అమాయకుల జూచి)

అడుసు తొక్కనేల
కాలు కడుగనేల?
అధర్మము పెంచనేల?
అవతార మెత్తనేల?
తొక్కిసలాటలేల?
తొక్కుడులో చావులేల?
అరాజకమాపలేని
ఆ ఏలిక మాకేల?
అవాంతరమాప లేని
ఆ వేలుపు ఊసేల?
భక్త జనుల బాగు జన్మను
జాగు సేయక సాగనంపే
ఖాతరెరుగని
జాత రెందుకు?
సర్వాంతర్యామికి
గుడులేల, మడులేల?
గుండె లేని గుండ్రాయికి
పూవులేల, పూజలేల?
మనుషులు చేసిన దేవునికి
మడి ఏల, మణులేల?
అన్నీ తనవైన అజుడికి
అభ్రమేల, మభ్యమేల?
ఎల సిరిగల వానికి
ఇల పరిగ ల నగలేల?
వెర్రి బేలల తొర్రి
వెరపుకు తెఱపి గాక
నరుని కుటిలపు
పగటి కొల్లకు
బలుపు గాక



- ప్రతాప్
రాజులపల్లి
97698 55645

నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 05-04-2026

# మానవత్వపు మౌనగీతం

## అమృతం కురిసిన రాత్రి




తెలుగు సాహిత్యాకాశంలో ధ్రువతారగా వెలిగిన మహాకవి దేవరకొండ బాలగంగాధర తిలక్. ఆయన పేరు చెప్పగానే మనకు గుర్తుకు వచ్చే అమృతం కురిసిన రాత్రి దీనితో పాటు తిలక్ ప్రభాతము-సంధ్య, గోరు వంకలు, కఠినోపనిషత్తు కవితా సంపుటాలతో పాటు తిలక్ కథలు (1967), సుందరీ-సుబ్బారావు (1961), ఊరి చివరి యిల్లు (1961), అనే కథానికా సంపుటాలు నాటకాలు, నాటికలు, లేఖ సాహిత్యం వంటి మొదలైన రచనలు అయన కలం నుండి జాలువారినవే అయితే అత్యధిక సాహితీ కారుల నాలుకలపై నాట్యమాడిన 'అమృతం కురిసిన రాత్రి'తో తిలక్ గారు భావకవిత్వపు మెత్తదనాన్ని, అభ్యుదయ కవిత్వపు పదునును మేళవించి 'అనుభూతి కవిత్వం' అనే కొత్త బాటను వేసిన స్రష్ట ఆయన. కవిత్వమంటే కేవలం పదాల గారడీ కాదని, అది "అంతరగ్ని జ్వాల, అది ఆత్మార్పణ" అని నమ్మిన నిఖార్సైన మానవతావాది. ఆయన అక్షరాలు "వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" లాగా ఎంత సుకుమారంగా ఉంటాయో, సమాజంలోని అన్యాయాలను చూసినప్పుడు "నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు కావు, అవి ఎక్కుపెట్టిన బాణాలు" అన్నంత పదునుగానూ మారుతాయి. "ఆర్తుడైన ఒక పేదవాడి కన్నీటి చుక్కలో వెయ్యి సూర్యులు ఉదయిస్తారు" అని పలికిన తిలక్, తన కలంతో సామాన్యుడి వేదనకు విశ్వరూపం ఇచ్చారు. అల్పాయుష్కుడైనప్పటికీ, తెలుగు కవిత్వ ఉన్నతిని "కాంతి కిరణాల పల్లకీ" పై ఎక్కించి అజరామరమైన ముద్ర వేశారు. భావకవిత్వపు మెత్తదనాన్ని, అభ్యుదయ కవిత్వపు పదునును మేళవించి, 'అనుభూతి కవిత్వం' అనే నూతన ఒరవడికి ప్రాణం పోసిన మహా మనిషి తిలక్. "అమృతం కురిసిన రాత్రి" ఈ సంపుటి కేవలం కవితల సమాహారం కాదు అది ఒక కాలపు సామాజిక వేదనకు, మానవీయ స్వప్నానికి అద్దం పట్టిన అక్షర రూపాలు. ఇందులో ఉన్న కవితలు ఆకలితో అలమటించే వాడి ఆర్తనాదమై ధ్వనిస్తాయి. తిలక్ మరణానంతరం కుందుర్తి ఆంజనేయులు పీఠికతో 1968లో ముద్రణ పొందిన తిలక్ కవితల సంపుటి ' అమృతం కురిసిన రాత్రి ' ఉత్తమ కవితాసంపుటిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 1971లో వచ్చింది. ఈ పురస్కారం రావడం, ఆయన ప్రతిభకు దక్కిన గౌరవం. తిలక్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అక్షరాలు నిరంతరం అమృతంలా కురుస్తూనే ఉన్నాయి. ఆధునిక తెలుగు కవిత్వం ఉన్నంత కాలం "అమృతం కురిసిన రాత్రి" పాఠకులకు ప్రేరణ నిస్తూనే ఉంటుంది. "కవిత్వం ఒక కాంతి రేఖ" అని నమ్మిన తిలక్, స్వయంగా ఒక వెలుగు దివిట్వై నేటి తరానికి మార్గదర్శిగా నిలిచారు. ఆయన అక్షరాలు అజరామరాలు, అనశ్వరాలు.

### కవిత్వ - తిలక్ దృక్పథం

కవిత్వం అంటే ఏమిటో, కవి బాధ్యత ఏమిటో తిలక్ తన అక్షరాల్లోనే అత్యద్భుతంగా నిర్వచించారు. ఆయనకు కవిత్వం అంటే కేవలం పదాల గారడీ కాదు, అది ఒక ఆత్మార్పణ. "కవిత్వం అంతరగ్ని జ్వాల, అది ఆత్మార్పణ నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" ఆయన శైలిలో అలంకారాలు అభరణాల్లా ఒదిగిపోతాయి. వచన కవిత్వంలో కూడా ఒక విలక్షణమైన లయను సృష్టించడం తిలక్ గారి ప్రత్యేకత. కవిత్వం ఎలా ఉండాలి? ఎవరి కోసం ఉండాలి? అనే విషయాలను తిలక్ ఈ కవితలో స్పష్టంచేశారు. అంతే కాదు ఆయన కవిత్వం వాస్తవికతకు అద్దం పడుతుంది.

*"నా కవిత్వం కాదొక తత్వం*
*మరి కాదు మీరనే మనస్తత్వం*
*కాదు ధనికవాదం సామ్యవాదం*
*కాదయ్యా అయోమయం జరామయం" అంటూనే*
*"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారవతాలు*
*నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు*
*నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"*

(నా కవిత్వం) అని అంటారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక విప్లవాత్మకమైన ప్రకటన వంటివి. తిలక్ తన కవిత్వం ఏ చట్రంలోనూ ఇమడదని చెబుతూనే, దానికి ఉండాల్సిన అసలైన లక్షణాలను అత్యంత సుందరంగా వివరించారు. లోకంలో ఎక్కడ కన్నీరు కార్చే కన్ను ఉన్నా, ఆ కన్నీటి జడిలో తడిసి ముద్దయ్యే 'దయా పారవతాలు' (పావురాలు) తన అక్షరాలని ఆయన అభివర్ణించారు. ఇది కవికి సమాజం పట్ల, పీడిత ప్రజల పట్ల ఉన్న ఆర్ద్రతను, మానవతా దృక్పథాన్ని సూచిస్తుంది. అక్షరాలు కేవలం కన్నీరు తుడవడమే కాదు, ప్రజలలో పోరాట పటిమను పెంచాలంటారు ప్రజాశక్తి అనే రాజును మోసే పట్టపు ఏనుగులు (ఐరావతాలు) తన అక్షరాలని చెప్పడం ద్వారా, సమాజ మార్పులో కవిత్వానికి ఉన్న శక్తివంతమైన బాధ్యతను ఆయన గుర్తు చేశారు. సామాజిక సమస్యలను చర్చిస్తూనే, కవిత్వానికి ఉండాల్సిన కళాత్మక సౌందర్యాన్ని తిలక్ ఎక్కడా వదులుకోలేదు. వెన్నెలలో ఆడుకునే ఆడపిల్లల వంటి స్వచ్ఛత, ఆహ్లాదం తన కవిత్వంలో ఉంటాయని చెప్పడం ద్వారా 'అనుభూతి వాదాన్ని' బలపరిచారు.

### ఆర్తగీతం అనే కవితలో ...

సామాజిక బాధ్యత ఈ కవిత తిలక్ లోని 'మానవతావాది'ని సమాజంలోని అసమానతలను, పేదరికాన్ని అత్యంత హృద్యంగా ఈ కవితలో చిత్రించారు.

*" నేను చూశాను నిజంగా పిల్లలకు గంజి*
*కాశి పోసి తాను నిరాహారుడై*
*రుద్ధభాష్పాకూలిత నయనుడై ఆఫీసుకు*
*వచ్చిన వృద్ధుని ఫ్యూన్ వీరన్నని*
*"నేను చూశాను... నిజంగా క్షయగ్రస్త*
*భార్య ఇక బతకదని డాక్టర్ చెప్పినప్పుడు*
*ప్రచండ వాతుల హత నిపశాకవలె గజగజ*
*వణికిపోయిన ఆరిక్త ఆశక్త గుమస్తాని*
*ఆయిదా రుగురు పిల్లలు గలవాణ్ణి"*

కవి తన చుట్టూ ఉన్న దీనజనుల బాధలను చూసి చలించిపోయారు. సమాజం ఒక పద్మవ్యూహం లాంటిదని, అందులో చిక్కుకున్న సామాన్యుడి ఆకలి, అర్తనాదం తన కవిత్వంలో చూపించారు. ఒక చలవరాతి మేడలో కూర్చుని కవిత్వం రాయడం కాదు, వీధిలో ఆకలితో అలమటించే వ్యక్తి ముఖంలోకి చూడగలగడమే కవికి ఉండాల్సిన కనీస లక్షణమని తిలక్ నమ్మారు. అందుకే ఆయన కవిత్వం బాధితుల పక్షాన నిలబడి ఆర్తనాద గర్జన చేస్తుందని అన్నారు.

**తపాలా బంట్రోతు కవితలో...** సాధారణంగా కవులు దేవుడిని, రాజులను స్తుతిస్తారు. కానీ తిలక్ ఒక పోస్ట్‌మెన్‌ను (తపాలా బంట్రోతు) కథానాయకుడిని చేశారు.మనుషుల మధ్య సంబంధాలను, ఉత్తరాల ద్వారా సాగే భావోద్వేగాలను ఈ కవిత అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. పోస్ట్‌మెన్ మోసుకొచ్చేది కేవలం ఉత్తరాలు కాదు. ఒక తల్లి ప్రేమ, ఒక ప్రేమికుడి విరహం, ఒక నిరుద్యోగి ఆశ. అందుకే ఆయన

*"ఎండలో వానలో/ఎండిన, చివికిన/ఒక చిన్న సైజు జీతగాడు /చెవిలో పెన్సిల్/ చేతిలో సంచి/ కాకి దుస్తులు/ అరిగిన చెప్పులు /ఒక సాదా పేదవాడు /ఇంటింటికి/ వీరి వీధికి /ప్రతి రోజూ తిరిగేవాడు ప్రైమ్ మినిస్టరా ఏం/ అయితే చూడు ఆ కిటికీలో రెండు ఇచ్చిన కలువల్లాంటి కళ్ళు/ ఆ వీధి మొగవైపు ప్రసరిస్తున్న చూపుల ముళ్ళు/ ఆ కళ్ళలో ఆత్రుత /ఆ గుండెల్లో గడిచిన/ దేశాంతర గతుడైన ప్రియుడు వార్త కోసం"*

అని అంటారు. తిలక్ దేవుడు కంటికి కనిపించని ఆశ అయితే, పోస్ట్‌మెన్ కంటికి కనిపిస్తూ వార్తను మోసుకొచ్చే వాస్తవం. ఇక్కడ తిలక్ ఆధ్యాత్మికతను భౌతిక వాదంతో పోల్చి చూశారు. కంటికి కనిపిస్తూ సేవ చేసే మనిషి, కంటికి కనిపించని దేవుడి కంటే గొప్పవాడని చెప్పడం ద్వారా ఆయన 'మానవత్వమే మిన్న' అని చాటారు.

*"అమృతం కురిసిన రాత్రి*
*అందరూ నిద్రపోతున్నారు*
*నేను మాత్రం*
*తలుపు తెరిచి ఇల్లు విడిచి*
*ఎక్కడికో దూరంగా*
*కొండ దాటి కొనదాటి*
*వెన్నెల మైదానంలోకి*
*వెళ్లి నిలుచున్నాను"*

ఈ కవిత తిలక్ ఆశావాదానికి, మానవత్వానికి నిదర్శనం. ప్రపంచంలో కరువు, యుద్ధం, ద్వేషం ఉన్నప్పటికీ, ఏదో ఒకనాడు మానవత్వం వర్షిస్తుందని ఆయన కలగన్నారు. ఇక్కడ 'అమృతం' అంటే కేవలం దేవతలు తాగేది కాదు, అది ప్రేమ, కరుణ, శాంతి. లోకమంతా అజ్ఞానమనే నిద్రలో ఉన్నప్పుడు, కవి మాత్రమే మేల్కొని భవిష్యత్తు అంటే రాబోయే శుభోదయం కోసం ఎదురుచూస్తున్నానని, ఆశావాదాన్ని వదులుకోలేదని అర్థం. ఇది కవి యొక్క నిరంతర చైతన్యానికి నిదర్శనం.

అమ్మా! నాన్న ఎక్కడికి వెళ్ళాడు?" అనేది అత్యంత హృదయవిదారకమైన కవిత. యుద్ధం వల్ల కలిగే వినాశనాన్ని ఒక పసివాడి అమాయకపు ప్రశ్న ద్వారా తిలక్ ఇందులో చిత్రించారు.

ఈ కవితలో యుద్ధానికి వెళ్ళిన తండ్రి తిరిగి రాకపోవడాన్ని, ఆ నిజాన్ని భరించలేని తల్లి వేదనను తిలక్ వర్ణించారు. దీనిని కేవలం ఒక కుటుంబ కథగా కాకుండా, యుద్ధం మానవత్వానికి చేసే గాయంగా మనం చూడాలి. కవిత ప్రారంభమే ఒక చిన్నారి అడుగుతున్న ప్రశ్నతో మొదలవుతుంది.

*"అమ్మా! నాన్న ఎక్కడికి వెళ్ళాడు? ఎప్పుడు వస్తాడు?*
*అని అడిగాడు నాలుగేళ్ళ పసివాడు మరోసారి*
*అలవోకగా వాడి తలనిమురుతూ ఆమె అలాగే*
*ఆశతో వింటోంది రేడియోలో వార్తలు*
*ఆమె కళ్ళలో విమానాల రెక్కలు కదిలిన నీడలు*
*ఆమె గుండెల్లో మర ఫిరంగులు పేలిన జాడలు కాశ్మీరు సరిహద్దుల్లో*
*కమ్ముకున్న నల్లని పొగలమధ్య కాలూని నిల్చున్న సైనికుడు చటక్కున*
*ఆమె కళ్ళ ముందు నిలిచాడు"*


యుద్ధం అంటే ఏమిటో తెలియని ఆ పసివాడికి, తన తండ్రి దేశం కోసం వెళ్ళాడా లేదా మరణించాడా అన్నది అనవసరం. వాడికి కావలసింది తన తండ్రి సామీప్యం. తిలక్ అన్నట్టుగా ఆయన అక్షరాలు ఇక్కడ "కన్నీటి జడులలో తడిసే దయాపారవతాలు" లా మారాయి. నాలుగేళ్ల పసివాడు "నాన్న ఎక్కడికి వెళ్ళాడు?" అని అడుగుతున్నప్పుడు, ఆ ప్రశ్నలోని అమాయకత్వం పాఠకుడిని కలచివేస్తుంది. యుద్ధం అంటే ఏమిటో తెలియని ఆ బిడ్డ ఆర్తి, భర్త క్షేమం కోసం రేడియో వార్తల్లో ప్రాణాలు బిగబట్టుకుని వింటున్న ఆ తల్లి వేదన.. ఇవన్నీ తిలక్ కవిత్వంలోని మానవతా దృక్పథాన్ని ఆవిష్కరిస్తాయి. సరిహద్దుల్లో పేలుతున్న ఫిరంగుల శబ్దం ఆమె గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది. ఇది కేవలం ఒక రాజకీయ విశ్లేషణ (మనస్తత్వం) కాదు, అది ఒక అనుభూతి. యుద్ధం అంటే కేవలం భూభాగాల గెలుపు కాదు, అది కొన్ని కుటుంబాల ప్రశాంతతను బలితీసుకునే 'నల్లని పొగ' అని తిలక్ ధ్వనించారు. యుద్ధం వంటి కఠినమైన వస్తువును తీసుకున్నా, తిలక్ శైలిలో ఒక లాలిత్యం ఉంటుంది. ఆ పసివాడి ప్రశ్నలో, ఆమె తల నిమిరే స్పర్శలో ఒక సున్నితత్వం ఉంది. కవిత్వానికి ఉండాల్సిన సౌందర్య స్పృహను కోల్పోకుండానే, అత్యంత గంభీరమైన సామాజిక అంశాన్ని (యుద్ధ వ్యతిరేకత) ఆయన చర్చించారు. యుద్ధం తెచ్చే వీరత్వం కంటే అది మిగిల్చే శవాల గురించి తిలక్ నిర్భయంగా రాశారు.

తిలక్ "అమృతం కురిసిన రాత్రి" ద్వారా తెలుగు సాహిత్యానికి ఒక నూతన సౌందర్యాన్ని అద్దారు. ఆయన అక్షరాలు ఎప్పటికీ అజరామరాలు, అమరమైనవి. తిలక్ కవిత్వం "కుందనపు బొమ్మ" లాంటిది. ఆయన మాటల్లో చెప్పాలంటే, కవిత్వం అంటే ఒక "అనుభూతి".అది కేవలం మెదడుకు కాకుండా హృదయానికి హత్తుకుం టుంది. అమృతం కురిసిన రాత్రి చదువుతుంటే, మన చుట్టూ ఉన్న లోకం కొత్తగా కనిపిస్తుంది, తోటి మనిషిపై గౌరవం పెరుగుతుంది. భావకవిత్వం మరీ వ్యక్తిగతమైపోతున్న తరుణంలో, అభ్యుదయ కవిత్వం కేవలం నినాదాల హోరుగా మారుతున్న సమయంలో.. ఈ రెండింటి మధ్య ఉన్న అగాధాన్ని తన 'అనుభూతి'తో పూడ్చిన మహాకవి తిలక్‌గారి కవిత్వం చదువుతుంటే మనకు తెలియకుండానే కళ్ళల్లో నీళ్లు తిరుగుతాయి, హృదయం ఉప్పొం గుతుంది. దానికి కారణం ఆయన అక్షరాల్లో ఉన్న 'నిజాయితీ'. కవిత్వం అనేది కేవలం మేధోవిలాసం కాదని, అది సమాజపు గాయాలకు లేపనం పూయాలని ఆయన నమ్మారు. అందుకే ఆయన మరణించిన దశాబ్దాల తర్వాత కూడా, నేటికీ ఏ కవిత్వ సభ జరిగినా, ఏ సాహిత్య చర్చ వచ్చినా తిలక్ ప్రస్తావన లేకుండా అది పూర్తి కాదు. ఈ సందర్భంగా తిలక్ మనకు అందించిన సందేశం ఒక్కటే - మనుషుల మధ్య గోడలు కూల్చి, మమతల వంతెనలు నిర్మించాలి. కవిత్వం అనేది కేవలం కాగితం మీద సిరా చుక్క కాదు, అది రేపటి సమాజానికి వెలుగునిచ్చే దివ్వె. వారు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అక్షర రూపంలో కురిసిన ఆ 'అమృతం' పాఠకుల హృదయాల్లో ఎప్పటికీ తడుస్తూనే ఉంటుంది. సాహిత్య వనంలో తిలక్ రాల్చిన అక్షర సుమాలు ఎప్పటికీ వాడిపోవు. ఆధునిక తెలుగు కవిత్వ ఉన్నతిని తె లుసుకోవాలంటే ఈ కావ్యం ఒక దిక్సూచి. అని ఖచ్చితంగా చెప్పుకోవచ్చు.

డి. సాయినాథ్ రెడ్డి
6305584064



# క్రీస్తు పునరుత్థానం - ఈస్టర్ పర్వదినం



సర్వ మానవాళి పాపాలను పరిహరించడానికి లోకరక్షకుడైన ఏసుక్రీస్తు ప్రభువు వారు ఈ లోకానికి వచ్చారు. ఆయన మృత్యుంజయుడై (మరణాన్ని జయించి) లేచిన ఈరోజు కేవలం ఆచారబద్ధమైన పండుగ రోజు మాత్రమే కాదు. ఆయన పునరుత్థానం - పాపం విషయంలో మరణించి, నీతి పరిశుద్ధతల విషయంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలనే సత్యాన్ని తెలియజేస్తుంది. ఆయన ఈ లోకానికి మతాన్ని స్థాపించడానికి రాలేదు; అందుకే "నా రాజ్యం ఈ లోక సంబంధమైనది కాదు (పరలోక సంబంధమైనది)" అన్నారు. పాపులైన మనలను రక్షించి నిత్యజీవానికి (పరలోక రాజ్యానికి) వారసులుగా చేయడానికి దేవాతి దేవుడే మానవ రూపంలో ఈ లోకానికి వచ్చి, మన పాప, శాప భారాన్ని కలవరి సిలువపై భరించారు. "రోగులకే తప్ప ఆరోగ్యవంతులకు వైద్యుడు అవసరం లేదు; నేను పాపులనే పిలువ వచ్చితిని గానీ నీతిమంతులను పిలువ రాలేదు" అన్నారు. నీతిమంతుడు ఒక్కడు కూడా లేడని బైబిల్ చెబుతోంది. జన్మ పాపమైనా, కర్మ పాపమైనా లేని మనిషంటూ ఒక్కడూ లేడు. అందుకే ప్రతి ఒక్కరూ తాము చేసిన పాపాల నిమిత్తం బలులను పరిహారంగా అర్పిస్తారు.

రక్తం చిందించకుండా పాప క్షమాపణ కలుగదు. కాబట్టి పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకంగా ఉన్నవాడైన "ఏసు ప్రభువు రక్తము ప్రతి పాపము నుండి మనల్ని పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). అలాగే "కోడెల యొక్కయు, ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10:4) అని లేఖనాలు చెబుతున్నాయి. పాప రహితుడు, దేవుడు, పరిశుద్ధుడై ఉండాలి కాబట్టి ఆయన పురుష సంయోగం లేకుండా కన్యయైన మరియ గర్భాన జన్మించాడు. తన 33న్నర సంవత్సరాల నిండు యవ్వనంలో కలవరి సిలువ మరణానికి తనను తాను అప్పగించుకున్నాడు. ఏసుక్రీస్తు ప్రభువు వారి బలియాగం తర్వాత క్రీస్తును నమ్ముకున్న వారిలో జంతుబలి నిషేధించబడింది. ఆయన మరణం యాదృచ్ఛికంగా జరిగింది కాదు; తాను మరణించి మూడో దినం తిరిగి లేస్తానని ఆయన అనేక సందర్భాల్లో చెప్పారు (మత్తయి 12:39-40, 16:21, మార్కు 8:31, లూకా 9:22, యోహాను 2:18-22). ఆయన జనన, మరణ, పునరుత్థానాల గురించి వేల సంవత్సరాల క్రితమే ప్రవక్తలు (యిర్మీయా, యెషయా వంటి వారు) చెప్పిన మూడు వందలకు పైగా ప్రవచనాలు నెరవేరాయి. ఇవన్నీ పరిశుద్ధ గ్రంథం (బైబిల్)లో లిఖించబడ్డాయి. "ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమా రుని కని అతనికి ఇమ్మానుయేలు అని పేరు పెట్టును" (యెషయా 7:14). ఏసుక్రీస్తు ప్రభువు వారిని ఇమ్మాను యేలు అని, మెస్సయా అని పిలుస్తారు. అలాగే యెషయా 9:6 ప్రకారం: "ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవం తుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్త యగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును." ఏసు ప్రభువు అంటేనే ప్రేమ, దయ, క్షమ, రక్షణకు నిదర్శనం. నీతిమం తులుగా ఉన్న వారి కొరకు ప్రాణం పెట్టడంలో పెద్దగా చెప్పుకోవాల్సింది ఏమీ ఉండదు; కానీ పాపుల కొరకు ప్రాణం పెట్టడంలోనే ఆయన చూపించిన అసలైన ప్రేమ, త్యాగం కనిపిస్తుంది.అందుకే "మిమ్మును ప్రేమించిన వారినే ప్రేమిస్తే ఏమి ప్రయోజనం? మిమ్మల్ని ద్వేషించిన వారిని ప్రేమించడం, హింసించిన వారి కొరకు ప్రార్థన చేయడం - ఇదే కదా నేను కోరుకునేది" అన్నారు. "మీ దహన బలులు నాకు ఇష్టమైనవి కావు, మీ బలుల యందు నాకు సంతోషము లేదు" (యిర్మీయా 6:20), "కనికరమునే కోరుతున్నాను గానీ బలిని కాదు" అన్నారు. న్యాయంగా నడుచుకోవడం, దీన మనస్సు కలిగి ప్రవర్తించడం ఇవే ఆయనకు ఇష్టమైన బలులు.

మీరు శత్రువునైన - ప్రేమించుమెపుడు; ప్రేమ హృదయానికే - తండ్రి ప్రేమ దక్కు"ననిన నీ వాణి ద్వేషాగ్ని - నార్పగలదు; కాలుష సంహారి! కలువరి సిలువ ధారి! ఆయన ఇచ్చిన ఆజ్ఞల్లో ప్రధానమైనది "నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు". కేవలం మాటలతోనే కాదు, క్రియల్లో కూడా ఆయన దీనిని చేసి చూపించారు. సిలువ వేసే సమయంలో తనను అప్పగించిన వారిని సైతం ప్రేమిస్తూ, క్షమిస్తూ... "తండ్రీ, వీరు ఏమి చేయుచున్నారో వీరు ఎరుగరు గనుక వీరిని క్షమించు" అని ప్రార్థించారు. ఆయన సిలువ మరణం మనుషులపై ఉన్న అపారమైన ప్రేమను తెలియజేస్తుంది. ఇక్కడ పాపం అంటే కేవలం నరహత్య, వ్యభిచారం, దొంగతనం మాత్రమే కాదు; పొరుగువారిని దూషించినా, పాపపు ఆలోచనలు కలిగి ఉన్నా, ఇతరుల వస్తువులను ఆశించినా, చివరికి ఇతరులపై కోపపడటం కూడా పాపమే అని బైబిల్ చెబుతోంది.

ఉ॥ అంత పిలాతు లేదితని యందొక దోషము వీని నెట్లు శిక్షింతు వచింపుడన్న...**- జాషువా (క్రీస్తు చరిత్ర)**

**కం॥ నేరము కనుపడలేదని**
**హెరోదన్ మరలనంపె నీతని నీటకున్**
**మీరెన్ను నేరములుని**
**ష్కారణములు, నేరమొండు గానన్ నేనున్**
**- జాషువా (క్రీస్తు చరిత్ర)**

ఆయనను సిలువకు అప్పగించినప్పుడు పిలాతు, హేరోదు అనే పాలకులు "ఈయనలో మరణానికి తగిన ఏ పాపము లేదు" అని చెప్పారు. కానీ తండ్రి అయిన దేవుని చిత్తం నెరవేరాలి కాబట్టి ఆయన మౌనంగా సిలువకు అప్పగించబడ్డారు. యెషయా 53:10లో "అతనిని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను... నిఅతడు తనను తాను అపరాధ పరిహారార్థ బలి చేయగా, అతడు దీర్ఘాయుష్మంతుడగును" అని స్పష్టంగా ఉంది. ఆయన పునరుత్థానం చెందిన తర్వాత 40 రోజులు భూమి మీద ఉండి అనేకులకు కనబడ్డారు. యేసు శిష్యుల్లో ఒకడైన తోమా (దిదుమ) ఆయన చేతులలో మేకుల గుర్తులను చూసి, తన వ్రేలు ఆ గాయాలలో పెట్టి, ప్రక్కలో చేయి వేసి చూసి "నా ప్రభువా, నా దేవా" అని కన్నీళ్లు విడిచాడు (యోహాను 20:24-29). ఏసు మరణంతో చెల్లాచెదురైన శిష్యులంతా ఆయన పునరుత్థానంతో మరలా ఒకటయ్యారు. ఆయన బ్రతికి ఉన్నప్పుడు చేసిన అద్భుతాల కంటే, మరణించి తిరిగి లేవడం శిష్యుల్లో గొప్ప విశ్వాసాన్ని నింపింది. అందుకే వారు ప్రాణాలకు తెగించి ప్రపంచ నలుమూలలా సువార్తను ప్రకటించి హతసాక్షులయ్యారు.

దేవుడు దేవుడిగానే వచ్చినట్లయితే సిలువ మరణం ఆయనకు పెద్ద శ్రమ కాదు; కానీ ఆయన మనిషిగా వచ్చి, మనుషులకు మాదిరికరమైన జీవితాన్ని జీవించి చూపించారు. "ఆయన ఇక్కడ లేడు, తాను చెప్పినట్టే ఆయన లేచి ఉన్నాడు" (మత్తయి 28:6).

**మృతి జయించి మూడవరోజు లేచునంచు**
**ప్రభుని గురించి లేఖనములు వ్రాయబడుట**
**మారు మనసును పొందిన వారి పాప**
**ములు క్షమింపబడును సాక్షులరు మీరు**
**-జ్ఞానానందకవి (క్రీస్తు ప్రబంధము)**

ఈ విధంగా ఆయన మరణాన్ని జయించి లేచినట్లే, మనం కూడా మారుమనస్సు పొందితే మన పాపాలు క్షమించబడి పరలోకానికి వెళ్తామని నిరూపించడానికి ఆయన ఒక సాక్షిగా నిలిచారు.

-మోటూరి హిమబిందు,
రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్

